క్లుప్తంగా

విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ మెగా లక్కీ డ్రా

నెహ్రూనగర్: దీపావళి పురస్కరించుకుని చుట్టుగుంటలోని విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ వర్క్స్ అధినేత మలిశెట్టి సుబ్బారావు లక్కీ డ్రా ద్వారా 11 ప్రైజ్‌లు కస్టమర్లకు అందజేశారు. మొదటి ప్రైజ్‌గా హీరో మోటార్ బైక్, రెండోది ఎలక్ట్రానిక్ బైక్, మూడోది ఏసీ, నాలుగోదిగా వాషింగ్‌మిషన్ ఇలా 11 మందికి ప్రైజ్‌లు అందజేశారు.

హైందవ శంఖారావం బహిరంగ సభ కరపత్రం ఆవిష్కరణ

గుంటూరు మెడికల్: విజయవాడలో 2025 జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం భారీ బహిరంగ కరపత్రలను ఆదివారం ఆవిష్కరించారు. సన్నాహక సమావేశం గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర ప్రచారక్ విజయాదిత్య, జిల్లా కన్వీనర్ వంగా జనార్ధన్ రెడ్డి, మాధవరెడ్డి, గోపికష్ణ వివిధ క్షేత్రాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం బహిరంగ సభ కరపత్రం ఆవిష్కరించారు.

నేడు 'డయల్ యువర్ కమిషనర్'

నెహ్రూనగర్: 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో 0863–2224202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను కౌన్సిల్ హాల్‌లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

టీటీడీ పాలకవర్గంలో గిరిజనులకు చోటు కల్పించాలి

నెహ్రూనగర్: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకవర్గంలో గిరిజనులకు చోటు కల్పించాలని గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు పాండునాయక్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. గత వైఎస్సార్ ప్రభుత్వంలో కూడా గిరిజనులకు పాలకవర్గంలో చోటు కల్పించారని గుర్తు చేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం కూటమి ప్రభుత్వం కూడా గిరిజనులకు టీటీడీ పాలకవర్గంలో చోటు కల్పించాలని లేని పక్షంలో హైకోర్టును ఆశ్రయిస్తామని పేర్కొన్నారు.

దేవాలయాల్లో రజకులకు నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలి

నెహ్రూనగర్: రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో రజకులకు నామినేటెడ్ పోస్టులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అగ్రవర్ణ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నాయే తప్ప రాజ్యాధికారంలో వాటా ఇవ్వడానికి ఇష్టపడడం లేదని చెప్పారు. టీడీపీ అధికారంలోకి రావడానికి 90శాతం రజకులు కష్టపడి పనిచేసిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక పదవులన్నీ డబ్బున్న అగ్రవర్ణాలకి కట్టబెట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇప్పటికైన టీడీపీ ప్రభుత్వం కొత్త వాళ్లకి రెండు ఎమ్మెల్సీలు ఇవ్వాలని, రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టుల్లో రజకులకు అధిక ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

అలరించిన బ్రహ్మం గారి నాటక ప్రదర్శన



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి వారి భక్త బృందం బ్రహ్మంగారి నాటకం ప్రదర్శించారు. సూరపనేని శ్రీకాంత్ ఎండోమెంట్ సహకారంతో ప్రదర్శించగా, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, బొల్లేపల్లి సత్యనారాయణ, సూరపనేని శ్రీరామచంద్రమూర్తిచౌదరి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శ్రీరామచంద్రమూర్తిచౌదరి, వీరబ్రహ్మేంద్ర స్వామి వారి భక్త బృందాన్ని సత్కరించారు. మహావిష్ణు, కాలజ్ఞాని, జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారు కాలజ్ఞానం రూపంలో భవిష్యత్ తరాలకు ప్రపంచంలో జరగనున్న భవిష్యత్ ఘటనలను తాళపత్ర నిధి రూపంలో అందించిన వాటిలో కొన్ని ముఖ్య ఘట్టాలను బ్రహ్మం గారి నాటక రూపంలో ప్రదర్శించారు. నాటకం ప్రేక్షకులను అలరించింది.

లాలాపేట పీఎస్ పరిధిలో వారధి

పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని లాలాపేట పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం పాలాసుపత్రి సెంటర్ వద్ద వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, లాలాపేట పీఎస్ ఎస్‌హెచ్‌వో ఏవీవీ శివప్రసాద్ హాజరయ్యారు. ప్రజలకు సైబర్ నేరాలు, పోలీసుల సేవల గురించి వివరించారు.

ఎంఈఓ కార్యాలయ విభజనపై పీటముడి

- గుంటూరు తూర్పు, పశ్చిమ మండలాలకు కలిపి ఒకే కార్యాలయం
- రెండేళ్ల క్రితమే విభజించిన గత ప్రభుత్వం
- ఇప్పటికీ వెస్ట్ కార్యాలయంలోనే కొనసాగుతున్న ఈస్ట్ కార్యాలయం
- వందలాది మంది ఉపాధ్యాయుల సర్వీసు వ్యవహారాలన్నీ ఒకే కార్యాలయంలో నిర్వహణ
- ఆ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్న నలుగురు ఎంఈఓలు
- పాఠశాలల పర్యవేక్షణ, పరిపాలన విధులపై ఎంఈఓల మధ్య విభేదాలు
- తూర్పు, పశ్చిమ మండల ఎంఈఓలకు పరస్పర స్థాన చలనం



ప్రస్తుత గుంటూరు ఎంఈఓ కార్యాలయం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎంఈఓ కార్యాలయ ఏర్పాటుపై విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కలెక్టర్ బంగ్లారోడ్డులో ఉన్న గుంటూరు పశ్చిమ మండల ఎంఈఓ కార్యాలయంలోనే గత రెండేళ్లుగా తూర్పు మండల ఎంఈఓ కార్యాలయం కొనసాగుతోంది. పరిపాలన సౌలభ్యం కోసం ప్రతి మండలానికి రెండో ఎంఈఓ పోస్టును మంజూరు చేసిన గత ప్రభుత్వ పాలనలో రెండేళ్ల క్రితం గుంటూరు అర్బన్, రూరల్ మండలాలుగా ఉన్న ఎంఈఓ కార్యాలయాన్ని తూర్పు, పశ్చిమ మండలాలుగా విభజించారు. తూర్పు నియోజకవర్గంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంలో విద్యాశాఖాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

అదనపు ఎంఈఓల రాకతో..

జిల్లా కేంద్రమైన గుంటూరు నగర, రూరల్ పరిధిలో 505 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వేతనాల బిల్లులు మంజూరు, సర్వీసు విషయాలను ఎంఈవోలే పర్యవేక్షిస్తున్నారు. అయితే గతంలో అర్బన్, రూరల్ కలుపుకుని ఒక్క ఎంఈవోనే మొత్తం వ్యవహారాలు పర్యవేక్షించిన పరిస్థితుల్లో ఎంఈఓలపై పనిభారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రతి మండలానికి కొత్తగా ఎంఈఓ–2 పోస్టును మంజూరు చేసింది. ఆ విధంగా మంజూరు చేసిన ఎంఈఓ–2 పోస్టుతో గుంటూరు ఈస్ట్, వెస్ట్‌లలో ఎంఈఓ పోస్టులు నాలుగుకు చేరాయి. ప్రభుత్వం సృష్టించిన రెండో ఎంఈఓ పోస్టుల ద్వారా మండల విద్యాశాఖాధికారులకు ఉపశమనం కలిగింది.

అందరూ ఒకే కార్యాలయంలో..

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకర్గాలతో పాటు ప్రత్తిపాడు పరిధిలోకి వచ్చే రూరల్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గుంటూరు ఈస్ట్, వెస్ట్ పరిధిలోకి వస్తున్నాయి. నలుగురు ఎంఈఓలు జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తిస్తున్నారు. భౌగోళికంగా ప్రస్తుతం కలెక్టర్ బంగ్లా రోడ్డులో ఉన్న ఎంఈఓ కార్యాలయంలో వెస్ట్ పరిధిలోకి వస్తుంది. కాగా నలుగురు ఎంఈఓలకు ఒకే కార్యాలయం ఉండటంతో విధుల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకే గదిలో నాలుగు కుర్చీలు వేసుకుని విధులు నిర్వర్తిస్తున్నారు.

తూర్పులో కార్యాలయం కోసం..

జిల్లా కేంద్రం కావడంతో పాటు పెద్ద సంఖ్యలో పాఠశాలలు ఉండటంతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కొత్తగా ఎంఈఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పరిపాలనా సౌలభ్యం కోసం తూర్పులో నూతనంగా ఎంఈఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా గత ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా పలుమార్లు విద్యాశాఖ ఉన్నతాధికారులతో పాటు అప్పటి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తూర్పు, పశ్చిమ నియోజకరవర్గాల పరిధిలోని పాఠశాలల వ్యవహారాలు పూర్తిగా తూర్పు, పశ్చిమ మండల ఎంఈఓలు నిర్వర్తిస్తున్నప్పటికీ, ఒకే గొడుగు కింద ఉండటంతో ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పశ్చిమ మండల కార్యాలయంతో సంబంధం లేకుండా తూర్పు మండల ఎంఈఓ కార్యాలయాన్ని తూర్పు నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయాలిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్థిక వ్యవహారాలతో పని లేకుండా విభజన చేసేందుకు అవకాశమున్నా తూర్పులో ఎంఈఓ కార్యాలయ ఏర్పాటుపై విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యాన్ని వీడటం లేదు.

తూర్పులో ఎంఈవో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి

గుంటూరు తూర్పు, పశ్చిమ ఎంఈఓ కార్యాలయాలను విభజించేందుకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలి. తూర్పు ఎంఈఓ కార్యాలయాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం పాత బస్టాండ్ సెంటర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయాలి.

–మురికిపూడి దేవపాల్, చందోలు రవికుమార్, మోడల్ టీచర్స్ యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

పర్యవేక్షణపై విభేదాలు....

పాఠశాలల పర్యవేక్షణ, అకడమిక్ అంశాలపై ఎంఈఓల మధ్య పదే, పదే వివాదాలు తలెత్తుతున్నాయి. గుంటూరు నగరంలో 205 ప్రభుత్వ పాఠశాలలతో పాటు మరో 300 ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యతలు ఒక్క ఎంఈఓ కార్యాలయం నుంచే సాగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక కిట్‌లను పాఠశాలలకు పంపి, విద్యార్థులకు పంపిణీ చేయడం, పాఠ్య పుస్తకాలను సకాలంలో సరఫరా చేయడంతో పాటు ప్రభుత్వ నిబంధనలను ప్రైవేటు పాఠశాలలు కచ్చితంగా అమలు చేస్తున్నదీ, లేనిదీ పర్యవేక్షించే విధులను ఎంఈఓలు నిర్వహించాల్సి ఉంది. నలుగురు ఎంఈఓల నడుమ తలెత్తుతున్న వివాదాలు విద్యాశాఖకు తలనొప్పిగా పరిణమించడంతో ఆర్జేడీ బి.లింగేశ్వర రెడ్డి ఇటీవల తూర్పు, పశ్చిమ మండలాల పరిధిలోని ఎంఈఓలను పరస్పరం స్థాన చలనం కలిగించారు.గుంటూరు తూర్పు ఎంఈవో–1గా అబ్దుల్ ఖుద్దూస్, ఎంఈఓ–2గా కె.జ్యోతికిరణ్ వ్యవహరిస్తుండగా, పశ్చిమ ఎంఈఓ–1గా బీవీ రమణయ్య, ఎంఈఓ–2గా కె.నాగేంద్రమ్మను ఇటీవలే పరస్పర స్థాన చలనం కలిగించారు.

బ్రెయిన్ స్ట్రోక్‌పై అవగాహన కలిగి ఉండాలి

ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పవన్ కుమార్

లక్ష్మీపురం: మన గుండెకు రక్తం సరఫరా చేసే నాళాలలో బ్లాకులు ఏర్పడినప్పుడు ఎలా హార్ట్ ఎటాక్‌కు దారి తీస్తుందో మెదడుకు సంబంధించిన రక్త సరఫరా చేసే నాళాలలో కూడా బ్లాక్‌లో ఏర్పడిన లేదా రక్తనాళాలు చిట్లినా బ్రెయిన్ స్ట్రోక్‌కు దారితీస్తుందని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పవన్‌కుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశి వరామి రెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ బ్రెయిన్ స్ట్రోక్ సంబంధించిన లక్షణాలు తెలియజేస్తూ ఆకస్మాత్తుగా కంటి చూపు పోయినా, వినికిడి పోయినా, స్పర్శ పోయి మొద్దు పారిపోయిన, ఉన్నట్టుండి తూలుడు వచ్చినా, తల తిరగడం ఉన్నట్టుండి వచ్చిన, ఆకస్మాత్తుగా భరించలేని తలనొప్పి వచ్చినా అవన్నీ ఈ బ్రెయిన్ స్ట్రోక్‌కు సంబంధించిన లక్షణాలుగా గుర్తించి వెంటనే న్యూరాలజిస్ట్ కలసి తగిన వైద్యాన్ని పొందాలన్నారు. ఈ బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు కనబడిన వెంటనే ఒక గంట నుంచి నాలుగున్నర గంటల లోపు డాక్టర్‌ను సంప్రదించాలి ఎడల మంచి వైద్యం పొందే బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడకుండా బయటపడవచ్చు అన్నారు. ఒక్కొక్కసారి షుగర్ స్థాయి పడిపోయినప్పుడు కూడా ఇలాంటి బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు కనపడతాయి వివరించారు. డాక్టర్ పవన్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా ఉపాధ్యాయ నాయకులు ఏవీ రామారావు, విశ్రాంత అధ్యాపకుడు రామచంద్రరావు, అనవేమ ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి ప్రసంగించారు.

నల్లపాడు అగస్త్యేశ్వరాలయంలో కార్తిక మాస మహోత్సవాలు

గుంటూరు రూరల్: కార్తిక మాస ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం నుంచి నల్లపాడులోని అగస్త్యేశ్వరాలయంలో కార్తిక మాస మహోత్సవాలను ప్రారంభించినట్లు ఆలయ అర్చకుడు తుర్లపాటి ప్రసన్నాంజనేయకుమార్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4వ తేదీన మొదటి కార్తిక సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 5వ తేదీన నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హోమాలు జరుగుతాయన్నారు. 11వ తేదీన రెండో సోమవారం, 15వ తేదీన కార్తిక పౌర్ణమి కార్తిక దీపాలంకరణ ఏర్పాటు చేసినట్లు వివరించారు. 18వ తేదీన మూడో కార్తిక సోమవారం, 25వ తేదీన నాలుగో కార్తిక సోమవారం 29వ తేదీన మాసశివ రాత్రి, డిసెంబర్ 1వ తేదీన ఆదివారం కార్తిక అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపోత్సవం, కర్పూర జ్యోతి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 2వ తేదీన పోలి స్వర్గం, స్వయం పాక దానం కార్యక్రమాలు జరుగుతాయని కావున భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మనల్ని ఎవర్రా ఆపేది...!

- నగరంలో అడ్డగోలుగా వైన్ షాపు ఏర్పాటు
- గుడి, బడి నిబంధనలకు తూట్లు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ



కుందుల రోడ్డులో మద్యం దుకాణం ముందు ఇంకో రూము నిర్మాణం చేపడుతున్న దృశ్యం

నెహ్రూనగర్: కొత్త మద్యం పాలసీలో భాగంగా మద్యం షాపులను ఏర్పాటు చేస్తున్న ప్రైవేట్ మద్యం దుకాణాదారులు అడ్డగోలుగా ఏర్పాటు చేసుకుంటున్నారు. గుడి, బడి నిబంధనలను పక్కన పెట్టి మరి షాపులు ఏర్పాటు చేసుకుంటున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానిక ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నారు.

నగరంలో 33 మద్యం దుకాణాలు..

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 33 మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే వీటిని ఏర్పాటు చేసుకోవాలని గుడి, బడి నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిందేనని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధనల మేరకు గుంటూరు నగరంలో మద్యం షాపులను ఏర్పాటు చేయాలంటే మద్యం లైసెన్స్ దారులకు తలనొప్పిగా మారింది. వంద మీటర్ల పరిధిలో దేవాలయం, చర్చి, మసీదు, పాఠశాలలు, కాలేజీలు ఉండకూడదు అని రూల్స్ ఉన్నా కుందుల రోడ్డులో ఓ వైన్స్ షాపు గుడి, బడి నిబంధనలకు విరుద్ధంగా షాపు ఏర్పాటు చేయడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. దీంతో పాటు ఉన్న షాపుతో పాటు అదనంగా ముందు ఇంకోక రూము నిర్మాణానికి దుకాణాదారులు చర్యలు తీసుకుంటున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై పలువురు ఎక్సైజ్ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. అధికారం మనదే కదా.. మనల్ని ఎవర్రా ఆపేది అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కొంత మంది లైసెన్స్ దారులు.

షుగర్ బాధితులు అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ నూతక్కి విజయలక్ష్మి



మాట్లాడుతున్న డాక్టర్ నూతక్కి విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: షుగర్ శరీరంలోని అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుందని, ముఖ్యంగా గుండె ఆరోగ్యంగా ఉంటే హఠాత్తుగా వచ్చే గుండెపోటును నిరోధించడం ద్వారా చాలా మంది ప్రాణాలను కాపాడవచ్చునని ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, కార్డియాలజిస్ట్ డాక్టర్ నూతక్కి విజయలక్ష్మి అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా గుండెజబ్బులపై అవగాహన సభ, ఉచిత వైద్య శిబిరంలో ఆదివారం నిర్వహించారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మధుమేహ బాధితులు కనీసం ఐదు సంవత్సరాలకు ఒకసారి ట్రెడ్మిల్ పరీక్ష, ఇకో పరీక్ష చేయించుకోవడం మంచిదని చెప్పారు. మధుమేహ బాధితుల్లో న్యూరోపతి వల్ల గుండెపోటు వచ్చిన గుండె నొప్పి తెలియదని అందువల్ల మధుమేహ బాధితులు గుండె జబ్బుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ టి.సేవ కుమార్ మాట్లాడుతూ ముందు జాగ్రత్తలతో ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా తమ సంస్థలు ఆరోగ్య చైతన్య సభలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాయన్నారు. సభకు టీవీ సాయిరాం అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మల రాణి, మానవతా సభ్యులు చావా శివాజీ, లక్ష్మి, జి.లక్ష్మీనారాయణ, ఆనందరావు, ఎస్.సాంబశివరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సెంటిమెంట్‌తో హడల్

- అధికారులకు కలిసిరాని నూతన కార్యాలయాలు
- కార్యాలయం ప్రారంభం కాగానే నర్సింగ్ సూపరింటెండెంట్ బదిలీ
- తాజాగా జీజీహెచ్ సూపరింటెండెంట్ బదిలీ
- ఆస్పత్రిలో సెంటిమెంట్‌తో అధికారుల్లో ఆందోళన



ఆధునికీకరించిన సూపరింటెండెంట్ కార్యాలయం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ అధికారులకు నూతన కార్యాలయాలు ఏర్పాటు చేయటం ఏ మాత్రం కలిసి రావటం లేదు. పాత కార్యాలయాలను ఆధునికీకరించగానే ఇరువురు అధికారుల బదిలీ అవ్వటం, ప్రస్తుతం ఆస్పత్రి అంతా చర్చాంశనీయంగా మారింది. నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశాసజని, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఇద్దరూ కూడా నూతన కార్యాలయాలు ప్రారంభం అవ్వగానే బదిలీ అయ్యారు.

బాగా పనిచేసినా బదిలీవేటు.....

గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కె.ఆశాసజని బాగా పనిచేసినట్లు పేరు తెచ్చుకున్నారు. నర్సింగ్ కేర్ మెరుగుపర్చటంలో, మెరుగైన వైద్యసేవలు రోగులకు అందించటంలో తన వంతు శాయశక్తులా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. ఆమె కార్యాలయాన్ని ఆగస్టులో ఆధునీకరణ చేయించారు. పాత కార్యాలయంలో గోడల్లో కొద్దిగా మార్పులు చేసి నూతనంగా రంగులు వేయించి కొత్త కార్యాలయం మాదిరిగా తీర్చిదిద్దారు. నూతనంగా కార్యాలయాన్ని ప్రారంభించి పట్టుమని పదిరోజులు కూడా నూతన కార్యాలయంలో ఆమె కూర్చోకుండానే కడప జిల్లా పులివెందులకు బదిలీ అయ్యారు. నర్సింగ్ సిబ్బందికి డ్యూటీలు వేసే సమయంలో పక్షపాతం చూపిస్తున్నారని, కొన్నిసార్లు నగదు చేతులు మారాయని ఆమెపై ఆరోపణలు వచ్చాయి. లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు రావటంతో కడపకు బదిలీ చేశారు. నూతనంగా గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతిపై వచ్చిన గంగ నూతన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

సంస్కణలు కేరాఫ్‌గా....

గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టి జూలై నాటికి ఏడాది పూర్తయ్యింది. ఏడాది కాలంలో ఆస్పత్రిలో ఎన్నడూ లేని విధంగా అనేక సంస్కరణలు చేపట్టి ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు సత్వరమే అందించేందుకు తన వంతు కృషి చేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పారితోషికాల రూపంలో 2009 నుంచి తనకు వస్తున్న డబ్బులను ఆస్పత్రి అభివృద్ధికే ఇచ్చారు. సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టాక దాతల సాయంతో ఐదు కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఓపీ విభాగంలో ఎన్నడూ లేని విధంగా 10 ప్రత్యేక ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేశారు. రోగులు, వారి సహాయకులు వేచి ఉండేలా షెడ్లు నిర్మించారు. మినరల్ కూలింగ్ వాటర్ ఆర్‌ఓ మెషిన్లు పలు వార్డుల్లో పెట్టించారు. రోగులకు 24 గంటలు మెరుగైన వైద్యసేవలు అందేలా అసిస్టెంట్ ఆర్‌ఎంఓలను తన కార్యాలయంలో అందుబాటులో పెట్టి డ్యూటీ డాక్టర్స్‌కు ఫోన్‌లు చేసి, రోగులకు, వారి సహాయకులకు ఆరోగ్య సమాచారం తెలియజేసి సత్వర చికిత్సలకు నాంది పలికారు. నూతన బ్లడ్ బ్యాంక్, నూతన ఐసీయూ, పలు ఆపరేషన్ థియేటర్స్‌ను ప్రారంభించి అరుదైన రికార్డు సృష్టించారు. ఆస్పత్రి చుట్టూ ఆక్రమణలు తొలగింపచేసి ట్రాఫిక్ సమస్యకు, శానిటేషన్ సమస్యకు చెక్‌పెట్టారు. సంస్కరణలు చేసి రోగులకు సేవలందేలా చేసినా ఆయనపై బదిలీ వేటు పడింది.

సూపరింటెండెంట్ కార్యాలయానికి హంగులు...

ఆస్పత్రిలో గతంలో ఉన్న సూపరింటెండెంట్ కార్యాలయాన్ని సుమారు రూ.12 లక్షలతో ఆధునికీకరణ చేయించారు. కార్పొరేట్ ఆస్పత్రుల కంటే ధీటుగా కార్యాలయాన్ని తీర్చిద్దిదారు. ఎలాంటి హడావుడి లేకుండా నూతన కార్యాలయంలోకి ఆయన అడుగుపెట్టిన పదిరోజుల వ్యవధిలోనే గత నెల 28న డాక్టర్ కిరణ్‌కుమార్‌ను సూపరింటెండెంట్‌గా బదిలీ చేసి జనరల్ సర్జరీ ప్రొఫెసర్‌గా నియమించారు. ఆర్థోపెడిక్ వైద్య విభాగాధిపతి డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ నూతన కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధుల్లో చేరారు. జిల్లాలో సంచలనం రేకెత్తించిన సహానా మృతి ఘటనలో సీఎంఓ కార్యాలయం ఆదేశాలు పట్టించుకోలేదని, అందుకే బదిలీ వేటు పడిందని కార్యాలయ వర్గాలు ఆరోపిస్తున్నాయి. కాని ఆస్పత్రిలో నూతన కార్యాలయం సెంటిమెంట్ బాగా పనిచేసిందని, కార్యాలయంలో అడుగుపెట్టిన పదిరోజులకే బదిలీ చేశారని అందరూ చర్చించుకుంటున్నారు.

నైపుణ్యాల ఆధారంగా మెరుగైన అవకాశాలు



పూర్వ విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే విద్యార్థులకు పుష్కలమైన అవకాశాలు ఉంటాయని పయనీర్ ఆటోమోటివ్స్ అధినేత చుక్కపల్లి రాకేష్ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా 2016–18, 2017–19, 2019–21 బ్యాచ్‌లలో ఉత్తీర్ణులైన ఎంబీఏ విద్యార్థులు కళాశాలలో తమ విద్యాభ్యాసం గడిచిన తీరు, ప్రస్తుత ఉద్యోగ జీవితంలో గడించిన అనుభవాలను పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కలుసుకుని ఆనందోత్సాహాలను పంచుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చుక్కపల్లి రాకేష్ మాట్లాడుతూ హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులకు అవకాశం ఇచ్చేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధమేనని చెప్పారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు బ్యాంకింగ్, సర్వీస్, మార్కెటింగ్ రంగాల్లో తమ జూనియర్లకు ఉద్యోగావకాశాలను కల్పించేందుకు అవసరమైన ప్రణాళికను ప్లేసమెంట్ అధికారి సీహెచ్ వైష్ణవి, ద్వారా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర ఎస్వీ రమణకు వివరించారు. అనంతరం పూర్వ విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి ఎ.చక్రవర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విలక్షణ గ్రంథరాజం 'మేఘదూతము'



మేఘదూతము గ్రంథావిష్కరణ చేస్తున్న దృశ్యం

నగరంపాలెం: ప్రఖ్యాత రచయిత కొమాండూరు శ్రీరామచంద్రాచార్యుల వారసత్వాన్ని ఉనికిపుచ్చుకున్న రంగ నాథాచార్యులు మహాకవి కాళిదాసు సంస్కృత మూలం మేఘదూతమును ఆంధ్రానువాదంతో గ్రంథస్తం చేసి సఫలీకృతులవటం అభినందనీయమని ప్రఖ్యాత ప్రవచనకర్త డాక్టర్ కోగంటి శ్రీరంగనాయకి అన్నారు. ఆదివారం బృందావన్‌గార్డెన్స్ శ్రీపద్మావతి కళ్యాణవేదికపై కొమాండూరు రామచంద్రాచార్యులు, కొమాండూరు రంగనాథచార్యులు ఆంధ్రానువాదం చేసిన 'మేఘదూతము' గ్రంథావిష్కరణ సభ నిర్వహించారు. సభకు డాక్టర్ అద్దంకి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. అమరావతి పబ్లికేషన్స్ వల్లూరి శివప్రసాద్ గ్రంథావిష్కరణ గావించగా, ద్విభాష రచయిత, కవి డాక్టర్ కోగంటి విజయబాబు, దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ, డాక్టర్ వి.నాగరాజ్యాలక్ష్మి, కె.కృష్ణమాచార్యులు, శ్రీధరాచార్యులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుపై టీడీపీ వైఖరి ప్రకటించాలి

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్ బిల్లును వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యతిరేకిస్తూ బహిరంగ ప్రకటన చేసిన విధంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరి చెప్పాలని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్, ముస్లిం జేఏసీ అధ్యక్షుడు మహమ్మద్ కలీం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్ర వక్ఫ్ బోర్డు వారి పరిధిలో సర్వే కమిషన్ నివేదిక ఆధారంగా దాదాపు 3,500 సంస్థలు ఉండగా ఆ సంస్థలకు చెందిన భూములు 65 వేల ఎకరాల వరకు ఉన్నాయని తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టం 2024 బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి సదరు అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం సవరణ కోసం పెట్టిన అంశాలను కూలంకుషంగా పరిశీలించాలని కోరారు.

పేదలపై మోయలేని భారం

సీపీఎం నాయకుడు వై.నేతాజీ

పెదకాకాని: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదలపై మోయలేని భారం వేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వై.నేతాజి అన్నారు. పెదకాకాని మండలం, నంబూరు గ్రామంలో మండల మహాసభ ఆదివారం నిర్వహించారు. ఈ సభకు ఎం.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకుడు తీయగూర అంజిరెడ్డి ఆవిష్కరించారు. వై.నేతాజీ, ఈమని అప్పారావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మోదీ పేద ప్రజలపై బారాలు మోపటం, కార్మిక చట్టాల్లో మార్పులు చేయడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేకహోదా, విభజన హామీలు, వెనకబడిన జిల్లాలకు ప్యాకేజీ ఇవ్వకుండా పెద్ద ఎత్తున నిధులు ఇస్తున్నామని చెబుతూ ప్రపంచ బ్యాంకు వద్ద అప్పులు తీసుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌కి వెసులుబాటు కల్పించారే తప్ప గ్రాంటు కింద ఇచ్చింది ఏమీ లేదన్నారు. ఉపముఖ్యమంత్రి సనాతన ధర్మం పేరుతో ప్రచారం చేస్తున్నారని, ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని గుర్తు చేశారు. సభలో మండల కన్వీనర్‌గా నన్నపనేని శివాజీ ఎన్నుకున్నారు.